సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చీడికాడ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదగొగాడ వైద్యాధికారిణి ఉషాచైతన్య అన్నారు. మండలంలోని ఈ.కొత్తపల్లి గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 72 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎస్.భారతి, ఎన్.వెం కటలక్ష్మి, శ్రీనివాసరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డవాగులో కంటైనర్

- గతంలో 266/1లో తొలగించారు
- ప్రస్తుతం 229 గెడ్డ వాగులో పెట్టేసారు
- మంత్రిపాలెంలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - పరవాడ: మండలంలో ఎక్కడ చూసినా అక్రమార్కులు బరితెగింపునకు దిగుతున్నారు. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు దర్జాగా అందులో వాలిపోతున్నారు. అతి గెడ్డ వాగా, చెరువా అనేది చూడటం లేదు. అధికారుల చర్యలు కూడా పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఎవరుబడితే వాళ్ళు ప్రభుత్వ భూముల్లో పాగా వేస్తున్నారు. ముఖ్యంగా మంత్రిపాలెం రెవెన్యూలో ఇటువంటి పరిస్థితే ఇటీవల ఒకటి చవిచూసింది. సర్వే నెంబర్ 229లోని గెడ్డ వాగులో అక్రమార్కులు ఓ కంటైనర్‌ని ఏర్పాటు చేశారు. గత ఏడాదిన్నర క్రితం ఇదే కంటైనర్‌ను లంకెలపాలెం - పెదముషిడివాడ మెయిన్ రోడ్డు పక్కన మంత్రిపాలెం సర్వే నెంబర్ 266/1లో ఏర్పాటు చేశారు. అది కాస్త ప్రభుత్వ స్థలం కావడం, పైగా జీవీఎంసీ పరిధి కావడంతో స్థానికులు రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు శాఖలకు చెందిన సిబ్బంది ఆ కంటైనర్‌ను అక్కడ నుంచి తొలగించారు. అదే కంటైనర్‌ను మంత్రిపాలెం గ్రామం సమీపంలో ఆర్వో ప్లాంట్ పక్కకు తరలించారు. అయితే అప్పటి నుంచి సైలెంట్ గా ఉన్న అక్రమార్కులు పక్కనే ఉన్న గెడ్డ వాగులో ఏర్పాటు చేసేశారు. ఆ కంటైనర్‌ను దుకాణ సముదాయంగా మార్చి అద్దెలకు ఇచ్చేందుకు సిద్ధం చేశారు. దీనిపై అధికారులు కూడా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పిర్యాదులు ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలకు ఉపక్రమిం చలేదు. పైగా రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు అక్రమా ర్కులతో కుమ్మక్కైనట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెడ్డవాగుపై అక్రమంగా ఏర్పాటు చేసిన కంటైనర్‌ను తొలగించి సంబంధిత అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చంద్రబాబు నాయుడు క్యాబినెట్‌లో వంగలపూడి అనితకు స్థానం

- రాష్ట్ర మంత్రిగా వంగలపూడి అనిత
- టీచర్ నుంచి మంత్రిగా ఎదుగుదల

విశాలాంధ్ర - పాయకరావుపేట: రాష్ట్రంలో నూతనంగా కొలువు తీరిన ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న క్యాబినెట్లో పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు మంత్రిగా స్థానం లభించింది. మంత్రిగా వంగలపూడి అనిత ప్రమాణ స్వీకారం చేశారు. రాజకీయ చరిత్రలో పాయకరావుపేట ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావడం ఇదే మొదటిసారి. అది కూడా వంగలపూడి అనితతో సాధ్యమైంది. పాయక రావు పేట మండలం, రాజవరం శివారు గజపతినగరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేసిన వంగలపూడి అనిత, 2014లో టీడీపీ నుంచి మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో కొవ్వూరు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పాయకరా వుపేట నుంచి పోటీ చేసి 43,727 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనితకు మంత్రి పదవి దక్కటం పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. పాయకరావుపేట ఎమ్మెల్యేకి మంత్రి పదవి దక్కాలని ఎన్నాళ్ళ నుంచో కలలు కన్న నియోజకవర్గ ప్రజల కోరిక నెరవేరింది. వంగలపూడి అనితకు మంత్రి పదవి దక్కడం పట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకుంటున్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని జమాదులపాలెం గ్రామంలో గత కొన్ని నెలలుగా వీధిలైట్లు మరమ్మతులకు గురి కావడంతో గ్రామస్తులు రాత్రి పూట రాకపోకలు సాగించేటప్పుడు చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రధానంగా హైవే నుంచి గ్రామానికి రాత్రిపూట వెళ్ళటానికి కూలి పని చేసుకుని రాత్రిపూట వచ్చేటప్పుడు, విష పురుగుల బారిన పడేవారు. అది గమనించిన కూటమి నాయకులు బుధవారం సుమారు 150 వీధిలైట్లు తీసుకు వచ్చి హైవే నుంచి గ్రామానికి వెళ్లే రహదారిపై, పురవీధుల్లో లైట్లు వేయించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల నాయకులు ఒమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ గ్రామానికి చెందిన గ్రామస్తులు అందరూ ఉదయాన్నే లేచి ప్రతిరోజు కూలి పనికి వెళ్లి రాత్రులు వచ్చేటప్పుడు వీధిలైట్లు లేకపోవడంతో చీకట్లో రావడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని దీనిపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో కూటమి నాయకులు ఆధ్వర్యంలో వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. ప్రధానంగా జమాదులపాలెంలో మంచినీటి సమస్య ఉందని దానిపై కూడా అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. త్వరలో మంచినీటి సమస్య కూడా పరిష్కారం చేస్తామని ఆయన తెలిపారు. ఈ వీధిలైట్లు వేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్య క్రమంలో ప్రకృతి సత్తిబాబు, మొల్లి బుజ్జి, కరక వినయ్, రేఖ శ్రీను, చందనాటి మోహన్, ఒమ్మి అశోక్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తరలిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - యలమంచిలి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార మహో త్సవానికి మంగళవారం రాత్రి యలమంచిలి మండలం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో వీరంతా విజయవాడకు పయనమయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షులు నానాజీ, గొర్రెల బాబురావు మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి రాష్ట్రంలో మంచి సుపరిపాలన వస్తుందని స్పష్టం చేశారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజీనామా

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి సిరిదెల్ల శ్రీనివాస్ తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలు కావడంతో నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. తనకి అవకాశం కల్పించిన వైసీపీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, మాజీ శాసనసభ్యులు కన్నబాబు రాజుకి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కి, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. జరిగిన ఎన్నికల్లో విజయం సాధించినటువంటి ఎన్డీఏ కూటమికి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల్లో కూటమి నాయకుల సంబరాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, మంత్రులుగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ప్రమాణ స్వీకారం చేయడం పట్ల పలు గ్రామాల్లో కూటమి పార్టీల నాయకులు సంబరాలు జరుపుకుంటున్నారు. మండలంలోని మాసాహెబ్ పేట గ్రామంలో టీడీపీ నాయకులు కంకిపాటి వెంకటే శ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - నక్కపల్లి: నక్కపల్లి పట్టణంలో వెంకటనగరం కాలనీలో ఉన్న సంపత్ వినాయకుని 6వ వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈ మేరకు బుధవారం స్వామి వారికి ఉదయం నుంచే అభిషేకాలు, పూర్ణాహుతి, విశేష పూజలు నిర్వహించారు. ఈ మేరకు భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థా ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

మంగవరంలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని మంగవరం గ్రామంలో పారిశుధ్య పనుల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో ఉన్న మురికి కాలువలను శుభ్రం చేయించారు. గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే. స్వప్న, ఈఓపీఆర్డీ చంద్రశేఖర్, ఏఈ మనోజ్ కళ్యాణ్, పంచాయతీ కార్యదర్శి నరేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రమాణ స్వీకారోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కే.కోటపాడు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పలు ప్రభుత్వ కార్యాల యాల్లోనూ, అనేకమంది ఇళ్లల్లోనూ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. మండలంలోని తహశీల్దార్, ఎంపీడీవో, వెలుగు, ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద ఎల్ఈడి టీవీలను ఏర్పాటు చేశారు. అలాగే 17 గ్రామ సచివాలయాల వద్ద టీవీలతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సరిగ్గా 11.29 నిమిషాలకు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు అనే నేను... అనగానే పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు, ఉద్యోగులు కేరింతలు కొట్టారు. ఉదయం 11 గంటలకే ప్రజలు ఇళ్లకు చేరుకోవడంతో రోడ్లు ఖాళీగా దర్శన మిచ్చాయి. సుమారు గంట సేపు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆశాం తం వీక్షించారు. విజయవాడ గన్నవరం ఎయిర్పోర్ట్ వద్ద జరిగిన ఈ ప్రమాణ స్వీకార ఉత్సవానికి ముఖ్యమైన కార్యకర్తలతో కె.కోటపాడు మండలం నుండి ఒకే ఒక్క ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశారు. కొందరు సొంత వాహనాలతో బయలుదేరారు. పరిమితంగా పాస్‌లు జారీ చేయడంతో అనేకమంది కార్యకర్తలు వెళ్ళలేకపోయారు.

యలమంచిలి: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ప్రత్యక్షంగా ప్రజలు తిలకించేందుకు వీలుగా యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. యలమంచిలి మండలానికి చెందిన వందలాది మంది

ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని తిలకించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి రాష్ట్రంలో ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో అఖండ ఆధిక్యతతో విజయాన్ని సాధించాయి. బుధవారం 11.27 నిమిషాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

చోడవరం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో

టి.డి.పి. నేత, మాజీ వైస్ ఎం.పి.పి. భూతనాదు నానీకుమార్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. స్వర్గీయ టి.డి.పి. నేత మాజీ సి.ఎం. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి బాణాసంచా కాల్చారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సిరిసొల్ల సత్యారావు, భూతనాథ్ నాని కుమార్, సిరిసొల్ల చిన్న బాబు, గ్రామ టిడిపి జనసేన కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వి.మాడుగుల: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవం వేడుకలు మాడుగులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పుప్పాల అప్పలరాజు, బిజెపి నాయకులు దంగేటి సూర్యారావు, జనసేన నాయకులు రొబ్బ మహేష్‌తో పాటు వద్దాది రంజిత్ వర్మ, పి.సూర్యనారాయణవర్మ, ఢిల్లీ నానాజీ, పుప్పాల రమేష్, మండల సతీష్, గౌరీపట్టపు జగన్నాధరావు, బి.పైడినాయుడు, కొట్నాల త్రినాథ్, మరువాడ ఈశ్వరరావు, జన్నపల్లి రమేష్, వత్తల ప్రకాష్, ఎస్వీ కొండలరావు, మండల వాసు, ఊడి అప్పారావు, పుట్టా నానాజీ పాల్గొన్నారు.

విద్యుత్ కాంతుల్లో ప్రభుత్వ కార్యాలయాలు

విశాలాంధ్ర - పరవాడ: పరవాడలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ కాంతుల్లో దగదగ లాడుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా రెండ్రోజుల నుంచి పంచాయతీ కార్యాలయం, పలు సచివాలయాలను అధికారులు విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రమాణ స్వీకారాన్ని రాష్ట్ర ప్రజలు పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. దీంతో మండల పరిషత్తు కార్యాలయాన్ని, పలు సచివాల యాలను విద్యుత్తుతో అలంకరించారు. కార్యాల యాలు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి.

ఆలయ పాలకమండలి రాజీనామా

విశాలాంధ్ర - కశింకోట: అనకాపల్లి పట్టణంలోని శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి, శ్రీ సూర్యనారాయణ స్వామి - దేవస్థానం పాలకమండలి చైర్మన్ ధర్మకర్తలు తమ పదవులకు రాజీనామా చేసి రాజీనామా పత్రాన్ని ఆలయ ఈవో కీర్తి ఆదినారా యణకి అందజేశారు. రాజీనామా చేసిన వారు చైర్మన్ కర్రి మహాలక్ష్మీనాయుడు (కె.యం), ఆలయ ధర్మకర్తలు పెంటకోట అప్పలనాయుడు, విజ్జపు వాసు ముకుంద, మారిశెట్టి శ్రీను, తాడి నాగలక్ష్మి, తగరంపూడి నర్సింగరావు, మావుదూరి విద్యాసాగర్ (ఎక్స్ ఆఫీసియో మెంబర్) ఉన్నారు. వీరికి ఆలయ సిబ్బందికి చిరు కానుక గా వస్త్రాలు పెట్టి స్వీట్స్ ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రివర్గంలో 'కొణతాలకు' మొండిచేయి

ఊరించి ఉసూరుమనిపించిన వైనం

నిరాశలో అభిమానులు, జనసైనికులు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్ర మంత్రివర్గ కూర్పు పట్ల కూటమి నాయకులు, కార్యకర్తలు అసంతృప్తిగానే ఉన్నారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. కూటమి కట్టిన దగ్గర్నుంచి ఫలితాలు వచ్చేవరకు విజయం సాధించాలనే దృఢ సంకల్పంతో కూటమిలో ఉన్న పార్టీలు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేశారు. అనకాపల్లి అసెంబ్లీ నుంచి జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ టికెట్ సాధించిన దగ్గర నుండి కూటమి ప్రభుత్వం అధికారుల్లోకొస్తే మంత్రి పదవి ఖాయమనే ప్రచారం విస్తృతంగా జరిగింది. భారీ మెజార్టీతో గెలిచిన తర్వాత ఆ ప్రచారం మరింతగా ఊపందుకుంది. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ బుధవారం ప్రకటించిన మంత్రి వర్గంలో కొణతాల రామకృష్ణ పేరు లేకపోవడంపై అటు జనసైనికులు, ఇటు కొణతాల అభిమానులు తీవ్ర నిరాశ చెందారు. మూడు శాఖల మంత్రిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో కీలక భూమిక పోషించిన కొణతాల రామకృష్ణకు ప్రస్తుత మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు కొణతాల రామకృష్ణకు విద్యుత్ శాఖ అని కొంతమంది న్యాయశాఖ అని మరి కొంతమంది కాదు కాదు జల వనరుల శాఖ అని మరి కొంతమంది ఎవరికి నచ్చినట్లు వారు చెప్పుకుంటూ వచ్చారు.. కొణతాల రామకృష్ణ నిజాయితీ, అనుభవం ఈ రాష్ట్రానికి ఎంతో ఉపయోగమని అలాంటి వ్యక్తికి మంచి శాఖలే కేటాయిస్తారని ఆయన అభిమానులు ముందుగానే సంబరాలు చేసుకున్నారు. అయితే అందరి ఊహలకు అతీతంగా అంచనాలకు అందని విధంగా క్యాబినెట్లో చోటు కల్పించకపోవడంపై ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మంత్రివర్గం ప్రకటించే వరకు కూడా కొణతాలకు మంత్రి పదవి పక్కా అంటూ ఆయన అభిమానులు చేసిన హంగామా అంత ఇంత కాదు.. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత పోటీ చేసి అనకాపల్లి చరిత్రలోనే కనీ విని ఎరుగని అత్యధిక మెజార్టీతో గెలిచిన కొణతాలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం నిజంగా ఆశ్చర్యమే... కొణతాలకు మంత్రి పదవి ప్రకటిస్తారని ఉదయం నుంచే టీవీలకు అతుక్కుపోయిన ఆయన అభిమానులు క్యాబినెట్లో కొణతాల పేరు లేకపోవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. అప్పుల ఊబిలో చిక్కుకుపోయిన రాష్ట్రాన్ని సరైన గాడిలో పెట్టాలంటే ఎటువంటి అవినీతి లేని కొణతాల లాంటి వ్యక్తులను క్యాబినెట్ కి తీసుకుని ఉంటే ఆయన అనుభవము, దూర దృష్టి రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడి ఉండేవని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కొణతాల లాంటి వ్యక్తులను విస్మరించి అనుభవం లేని కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకోవడం పైన కూడా విమర్శలు వస్తున్నాయి. మంత్రివర్గంలోకి తీసుకోకపోయినా సరే కొణతాల సలహాలు సూచనలు తీసుకుంటే రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడతాయని హితవు పలుకుతున్నారు.